

ముగిసిన వైవీయూ బిఇడి పరీక్షలు
- తనిఖీ చేసిన విసి, రిజిస్ట్రార్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం బిఇడి సెమిస్టర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ముగిశాయి. గత నెల 27న జిల్లాలోని 16 కేంద్రాలలో ప్రారంభమైన ఈ పరీక్షలకు 4,062 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని ఎస్‌వి, శ్రీహరి డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను, లేపాక్షి నారపరెడ్డి బిఇడి కళాశాల, భారత్ బిఇడి కళాశాల కేంద్రాలను వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.ఈశ్వర రెడ్డి తనిఖీ చేశారు. ఎలాంటి సమస్యలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

వైఎస్ఆర్‌కు జగన్, షర్మిల నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి చీఫ్ షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమ వారం జగన్ తన సతీమణి భారతి, తల్లి విజయమ్మతో కలిసి ఇడుపు లపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తండ్రి వైఎస్ఆర్‌కు తల్లి విజయమ్మతో కలిసి నివాళులర్పించిన జగన్ భావోద్వేగానికి లోనయ్యారు. తమ తండ్రి వైఎస్ఆర్‌కు నివాళులర్పించేందుకు మూడు రోజుల పర్యటనలో భాగంగా జగన్ పులివెందులకు వచ్చారు. షర్మిల ఇడుపుల పాయలోని గెస్ట్ హౌస్‌లో బస చేశారు. ముందుగా వైఎస్ఆర్‌కు నివాళులర్పిం చేందుకు పులివెందుల నుండి జగన్ ఇడుపులపాయకు 7.15 నిమిషాలకు విచ్చేశారు. జగన్‌తో పాటు ఆయన సతీమణి భారతి, ఎంపీ అవినాష్‌రెడ్డి ఘాట్ వద్దకు చేరుకొని దాదాపు 45 నిమిషాల వరకు ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇడుపులపాయ నుండి కడప ఎయిర్ పోర్ట్‌కు బయలుదేరి వెళ్లి అక్కడ నుండి విజయవాడకు ప్రత్యేక విమానంలో బయల్దేరారు. జగన్ వెంట ఎంపీలు వైఎస్.అవినాష్‌రెడ్డి, గురుమూర్తి, వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధ, చంద్రశేఖర్, మాజీ డిప్యూటీ సిఎం ఆంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు కోరుముట్ల శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, గోవిందు రెడ్డి, రమేష్ యాదవ్, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, చంద్ర ఓబుల్ రెడ్డి, డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, రమేష్‌రెడ్డి, సుధీకర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి షబ్బీర్ అలీ, మల్లి కార్జున రెడ్డి, భారతి, రహంతుల్లాఖాన్ ఉన్నారు. జగన్ ఇడుపులపాయి నుండి వెళ్లిపోయిన తర్వాత 8.20 నిమిషాలకు పిసిసి ఛీఫ్ షర్మిల తన తండ్రికి నివాళ్ళుర్పించేందుకు తల్లి విజయమ్మ, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలిసి ఘాట్ వద్దకు విచ్చేశారు. గంట పాటు వైఎస్ఆర్ ఘాట్ వద్ద షర్మిల ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహనికి పూలమాలలతో నివాళులర్పించి వైఎస్ఆర్ సేవలను గుర్తు చేసుకున్నారు. వేర్వేరుగా జగన్, షర్మిల నివాళులర్పించినప్పుటికి విజయమ్మ మాత్రం ఇరువురు నివాళులర్పించే సమయంలో ఉన్నారు. ఈ సందర్బంగా షర్మిల విలేకరులతో మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరకాలం చెరగని సంతకం చేసిన గొప్పనేత వైఎస్ఆర్ అని ఆయన లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదని అన్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నది కేవలం 5 ఏళ్లు మాత్రమేనని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని సిఎం చంద్రబాబు నాయుడు, వైసిపి అధినేత జగన్‌లు నీరుగార్చారన్నారు. వైఎస్ఆర్ ఆశయాలు ఒక్కటి అమలు కావడం లేదన్నారు. కడప స్టీల్ ప్లాంట్ వైఎస్ఆర్ కల అని దాన్ని కూడా అటు వైసిపి ఇటు టిడిపి నెరవేర్చలేదని విమర్శించారు. విపత్తు ప్రభుత్వ నిర్లక్ష్యమనని చెప్పారు. రాష్ట్రంలో వరదలు ఒక అసాధారణ పరిణామంతో పాటు ఇది ఘోర విపత్తుగా ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విపత్తును ముందు అంచనా వేయలేక పోవడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇర్ఫాన్ బాష, విజయజ్యోతి, సలావుద్దీన్, ధ్రువకుమార్ రెడ్డి, భారతి, బాలం సుబ్బరాయుడు, వేమా రాజా, వెంకటేష్, అమర్, ఉత్తన్న, అఫ్జల్ ఖాన్, జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ బాధ్యులు పాముల బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.



వైఎస్ఆర్ సమాధికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న వై.ఎస్.జగన్, సతీమణి భారతి



వైఎస్ఆర్ సమాధికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న షర్మిల, ఆమె తల్లి విజయమ్మ

గురుకుల పాఠశాలలో అమానుషం

- ఐదవ తరగతి విద్యార్థినిపై ప్రిన్సిపల్ భర్త లైంగిక వేధింపులు
- ప్రిన్సిపల్ సస్పెన్షన్, పోక్సో కేసు నమోదు
- విద్యార్థినికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి–లక్కిరెడ్డిపల్లె

లక్కిరెడ్డిపల్లెలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అమానుషం చోటు చేసుకుంది. అభం శుభం తెలియని చిన్నారిపై కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఐదవ తరగతి విద్యార్థిని ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణంలో ఆరేసిన బట్టలు తీసుకు రావడానికి వెళ్లినప్పుడు ప్రిన్సిపల్ భర్త బాలసుబ్బయ్య పిలిచి లడ్డు, కారాలు ఇచ్చి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, విద్యార్థిని ప్రయివేట్ పార్ట్‌లు తడిమారని సీనియర్ విద్యార్థులు తెలిపారు. బాలిక భయంతో రాత్రంతా జ్వరం, తలనొప్పితో బాధపడ్డారని పేర్కొన్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ప్రిన్సిపల్ భర్తను పోలీసుల సోమవారం అరెస్టు చేశారు. విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విద్యార్థినుపై లైంగిక వేధింపులకు ఘటన తెలిసిన వెంటనే రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాఠశాలను సందర్శించారు. విద్యార్థినికి మంత్రి ప్రభ త్వం తరపున, తన సొంత డబ్బు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్ భర్తను కఠినంగా శిక్షించి ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు : మంత్రి

విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని తీవ్రంగా శిక్షించడం జరుగుతుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని లైంగిక వేధింపులకు గురికావడంతో మంత్రి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడడం క్షమించరాని నేరమని తెలి పారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని తీవ్రంగా శిక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని బాలికల గురు కుల పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థినులకు ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొంతమంది తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ పిల్లలను ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివిస్తుంటారన్నారు. అభం శుభం తెలియని చిన్నారులను కొంత మంది కామాంధులు లైంగిక వేధింపులకు గురి చేయడం క్షమించరాని నేరమ న్నారు. అలాంటి వారిని జైలుకు పంపి తీవ్రంగా శిక్షిస్తామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేసిన వెంటనే తమకు తెలియ జేయాలన్నారు. జిల్లాలోని బాలికల వసతి గృహాలలో ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాలను సందర్శించిన కలెక్టర్

కలెక్టర్ చామకుర్తి శ్రీధర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠ శాల సిబ్బందితో మాట్లాడారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగస్వామి, అంబేద్కర్ గురుకులాల సమన్వయ అధికారి మాధవి లత, లక్కిరెడ్డిపల్లి మండల తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంఇఒ చక్రి నాయక్, ఎంపిడిఒ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లి అంబేద్కర్ గురుకులంలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్ భర్త, ప్రిన్సిపల్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని, నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని సిఐ కొండారెడ్డి తెలిపారు



పాఠశాల ఆవరణంలో బైఠాయించిన విద్యార్థినులు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సమస్యలపై కలెక్టర్‌కు వినతులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతులు సమర్పించారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి రెసిడెన్షియల్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌కు, శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్య కోరారు. వేతనాలు రాకపో వడంతో కార్మికులు ఇబ్బం దులు పడుతు న్నారని పేర్కొ న్నారు. సేవ సుప్రీం ఏజెన్సీ యాజ మాన్యం స్పందించక పోవడం దారుణమని తెలిపారు. గ్రామ పంచా యతీ, స్వచ్ఛ భారత్ కార్మికులకు, జమ్మలమడుగు, ఇతర ప్రాంతాలలో 24 నెలలుగా వేతనాలు రాలేదని చెప్పారు. కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవ ుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరారు. మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు మండలంలో పని చేస్తున్న ఎంఇఒ శాంతిని తొలగించడం దారుణమని చెప్పారు. నగరంలోని మృత్యుంజ యకుంట డోర్ నంబరు 42/863 వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.. సైనిక సంక్షేమ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. **భూ కబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టాలని..** సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు అన్వేష్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాశినాయన మండలం అక్కింగుండ్ల, నాయనపల్లె, బద్వేల్ మండలం సి.కొత్తపల్లె, గోపవరం మండలం పి.పి.కుంట, బ్రహ్మంగారిమఠం మండలం చీటీపాయ గ్రామ రెవెన్యూ పొలంలో సుమారు 2000 ఎకరాలు ప్రభుత్వ భూములు గ్రామ పెత్తందారులు, అనర్హులు, ధనికులు, రాజకీయ పలుకుబడి కలిగిన పెద్దలు, ఆక్రమణలు చేశారని పేర్కొన్నారు. పదుల, వందల ఎకరాలకు ఒక్కొక్కరు చుట్టూ ఇనుప కంచెలు వేసి ఫామ్ హౌస్‌లు నిర్మించుకుని అనుభవించుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ ఫోర్జరీ రిజిస్టర్ డాక్యుమెంట్స్, కబ్జా కోర్ల అన్యక్రాంత భూముల వివరాలు, డాక్యుమెంట్స్ కలెక్టర్ చూపించారు. కలెక్టర్ స్పందిస్తూ ఈనెల 6న ఐదు గంటలకు మీరిచ్చిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌పై అధికారులతో మీ సమక్షంలోనే మాట్లాడి విచారణలకు ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. **ఆన్‌లైన్ వన్‌బి, అడంగల్ సమస్యలపై...** జిల్లాలో భూ సురక్ష, రీ సర్వే పేరుతో వన్‌బి, అడంగల్ ఆన్‌లైన్‌లో రాకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఎపిరైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సురక్ష రీ సర్వే పేరుతో సర్వే చేస్తున్నారని భూములు ఆన్‌లైన్‌లో వన్ బి అడంగల్ రాకుండా మండల తహశీల్దార్లు నిలిపివేశారని పేర్కొన్నారు. తద్వారా బ్యాంకులో రైతులు రుణాలు రెన్యువల్ చేసుకోవాలంటే ఆన్‌లైన్ వన్ బి, అడంగల్ అడుగుతున్నారని తెలిపారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను సిసిఎల్‌ఎ విజయవాడ వారి దృష్టికి తీసుకుని పోయి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాధిత రైతులు శివారెడ్డి ప్రతాపరెడ్డి రమణ ఖలీల్ రామిరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఆయా సమస్యలపై వినతి పత్రాలు అందజేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు చంద్రశేఖర్, మనోహర్

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదే శించారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి ఎస్ఇప నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను ముఖాముఖి మాట్లాడి తెలుసు కున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొ దట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరి ష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జి.వెంకటరాముడు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన వినతులపై జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తక్షణ స్పందించి మానవత్వానికి చాటుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన ఎ ఖదీర్ అనే బుద్ధిమాంద్య యువకుడికి పెన్షన్ పథకం వర్తింపజేయాలని తల్లిదండ్రులు కలెక్టర్‌కు విన్నవిం చారు. ఆ యువకుడికి వీల్ చేర్ సదుపాయం కూడా లేని పరిస్థితిని ప్రత్యక్షంగా గమ నించిన కలెక్టర్ శివశంకర్ తక్షణమే స్పందించారు. విభిన్న ప్రభావంతుల శాఖ ఎడి కృష్ణ కిషోర్ తోమాట్లాడి వెంటనే కొత్త వీల్ చైర్‌ను తెప్పించి వారికి అందజేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే కొత్త పెన్షన్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఖదీర్‌కు పెన్షన్ సదుపాయాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరడంలో జిల్లా యంత్రాంగం పారదర్శకంగా నిబద్ధతతో పని చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీదారుల పట్ల కలెక్టర్ చూపుతున్న మానవత్వం, తక్షణ స్పందనపై అటు ప్రజలు, ఇటు అధికారులు ప్రశంసిస్తున్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప: డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన, సత్వర పరిష్కారం లభించింది. సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి నిర్వహించిన డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో మొత్తం 08 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలను విన్నవించారు. ఫిర్యాదులకు సంబంధించిన శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కడప మండలం చిన్న చౌక్ పద్మావతి కల్యాణ మండపం సమీపంలో పాదచారులపై 15 నుండి 20 కోతులు మీదకు వస్తున్నాయని జ్యోతి పట్ వారు కలెక్టర్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు మైదుకూరులో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, కడప సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్రముఖ కంపెనీలతో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎ.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. అభి టెక్నాలజీస్, అమర్ రాజా గ్రూప్, ఆల్ డిక్సన్, ముత్తుట్ ఫైనాన్స్ లిమిటెడ్, నవత ట్రాన్స్ పోర్టులో వివిధ రకాల ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. 5,10, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, పీజీ చదివిన వారు అర్హులని తెలిపారు. వయసు 18 నుంచి 55 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.30 వేలు హోదాను బట్టి జీతం ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హత ధ్రువ పత్రాలు, ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు. అర్హతకు దగ్గ ప్రయివేట్ ఉద్యోగం పొందవచ్చన్నారు.

ఉర్దూ కవి సమ్మేళనానికి ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కర్నూల్ సెంట్రల్ మిలాదున్నబి కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే జాతీయ ఉర్దూ కవి సమ్మేళనానికి కడప కవుల బృందానికి ఆహ్వానం లభించిందని రాయలసీమ ఉర్దూ రైటర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సత్తార్ ఫైజి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4న కర్నూల్ నగరంలోని ఎం.ఎస్.ఫంక్షన్ హాల్లో జాతీయ నాతియ కమి సమ్మేళనానికి ఆహ్వానం పంపారని తెలిపారు.

షర్మిలను కలిసిన అలీఖాన్

ప్రజాశక్తి - కడప

కడపకు సోమవారం వచ్చిన పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిలను కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నేత రషీద్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కడప జిల్లాలో పార్టీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు.



షర్మిలకు బొకే అందజేస్తున్న అలీఖాన్

బీమా సంస్థల్లో ఎల్ఐసి అగ్రగామి
- కడప డివిజనల్ సీనియర్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

జీవిత బీమా సంస్థల్లో ప్రపంచంలోనే ఎల్ఐసి అగ్రగామిగా నిలిచిందని కడప డివిజనల్ సీనియర్ మేనేజర్ జి.కె.ఆర్.వి. రవికుమార్ పేర్కొన్నారు. ఎల్ఐసి 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడప బ్రాంచ్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 41 రకాల వ్యక్తిగత బీమా, 12 రకాల సామూహిక బీమా పథకాలను అందిస్తున్నామని అన్నారు. ఒక్క గత ఆర్థిక సంవత్సరంలోనే రూ 2.04 కోట్ల వ్యక్తిగత పాలసీల ద్వారానూ, 4.14 కోట్ల మందికి సామూహిక బీమా ద్వారానూ బీమా రక్షణ అందించిందన్నారు. 98.35శాతం క్లెయిమ్‌లను చెల్లించి విశ్వసనీయతకు మారుపేరుగా ఉన్న ఎల్ఐసి గత ఆర్థిక సంవ త్సరంలోనే 19 అవార్డులు గెలుచుకుందని పేర్కొన్నారు. గత సంవత్సరం ఎల్ఐ సి 7 నూతన పాలసీలు ప్రకటించిందని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తు న తమ పాలసీలను ఆదరించాలని, సేవలను అందుకోవాలని పిలుపు నిచ్చారు.

ఉపాధ్యాయులను మినహాయించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దుచేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ప్రత్యేకించి మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తొలగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం కడప జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంపై బోధనేతర పనులు రద్దు చేయాలని అనేక పోరాటాలు చేశామని తెలిపారు. నాటి పోరాటాల ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఆ ఆనందాన్ని అనుభవించక ముందే మరొక రూపంలో మరుగుదొడ్ల పొటోలు ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ అసిస్టెంట్ల చేత తీయించాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎస్ఎంసి. సభ్యులు, సచివాలయ అసిస్టెంట్ ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో తెలపడం వెనుక మర్మమేమిటో తెలపాలన్నారు. వ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమ బాట పడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, నాయకులు కృష్ణారెడ్డి, వనమాల రాము పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప : వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్ ఇరువురు సెంచరీలు చేయడంతో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 553 పరుగుల భారీ స్కోరు సాధించింది. వికెట్ నష్టపోకుండా 139 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 107.4 ఓవర్లలో 553 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని దత్తారెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి 181 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ అర్జున్ టెండూల్కర్ 165 పరు గులు చేశాడు. కడప జట్టులోని ఎస్ఎండి అస్లాం అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శి ంచి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ షేక్ ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 2.3 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 12 పరుగులు చేసింది.

నగరంలో క్లీన్ అండ్ గ్రీన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జి.వి.రమణ, మాలే శివ ఆధ్వర్యంలో గోకుల్ సర్కిల్ నుంచి వన్ టౌన్ సర్కిల్ వరకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కో – ఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్ హాజరయ్యారు. దారి పొడువునా కాలువలు, చెత్త శుభ్రం చేశారు. అనంతరం నగర అధ్యక్షుడు బోరెడ్డి నాగేంద్ర ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా ప్రచార కమిటీ కో – ఆర్డినేటర్ పత్తి విశ్వనాథ్, నగర ప్రధాన కార్యదర్శి సాయి స్వరూప్, ఉపాధ్యక్షులు భరత్, శేషు, కార్యదర్శులు తరుణ్, వినయ్, సుబ్బారాయుడు, వెంకటేష్ జనసేన పొలిటికల్ సెక్రెటరీ ఫ్రాన్సిస్ అలీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్లు శుభ్రం చేస్తున్న జనసేన నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాల పీజీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కడప సిటీ : తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్యకళాశాల, ఇండియన్ అకాడమీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ వారు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో కడప ప్రభుత్వ వైద్యకళాశాల కడప కమ్యూనిటీ మెడిసిన్ పీజీ విద్యార్థులు ప్రతిభ కన రిచారు. 'పోస్టర్ ప్రజెంటేషన్' అనే అంశంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు మొదటి సంవత్సరం పీజీ విద్యార్థి డాక్టర్ బి. విజయ్ కుమార్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'ఆహార భద్రత–అవగాహన' అంశంపై అధ్య యనం చేసి పోస్టర్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లా డుతూ పోస్టర్‌ను రూపొందించడంలో గైడ్ డాక్టర్ సుబ్బరాయుడు, అసోసి యేట్ ప్రొఫెసర్, డాక్టర్ వి. లక్ష్మీదేవి అసిస్టెంట్ ప్రొఫెసర్ మార్గదర్శకత్వంలో విజయం సాధించానని చెప్పారు. సహకరించిన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ, విభాగాధిపతి డాక్టర్ బి గోపికృష్ణ, ఇతర ఆచార్యులకు సహ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-కలసపాడు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5న గురుపూజోత్సవ సందర్భంగా ఉపాధ్యాయు లందరికీ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తా ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మూల'కు జానపద పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డికి జానపద పురస్కారం లభించింది. జానపద సాహిత్య పరిషత్ హైదరాబాద్ వారు సోమవారం హైదరాబాద్ కూకట్ పల్లి కృష్ణ, సింధూరి సంకల్ప లలిత కళా నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పూర్వ ముఖ్య సలహాదారులు డాక్టర్ కె.వి.రమణాచారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. 'జానపద సాహిత్య పురస్కారాన్ని' స్వీకరించిన సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం అభినందనలు తెలిపారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-అట్లూరు : బద్వేల్ సబ్ డివిజన్‌లో ఈనెల 4న ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎఇ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు బద్వేల్‌లోని సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తామని మైదుకూరు డివిజన్ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, వనిపెంట, చాపాడు, ఖాజీపేట, బద్వేల్, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం, పోరుమామిళ్ల, కలసపాడు, బి. కోడూరు, కలసపాడు, కాశినాయనకు సంబంధించి విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-అట్లూరు : మండలంలోని తంబళ్లగొంది విఆర్ఎ శీలం గంగయ్య (57) గుండెపోటుతో మృతిచెందారు. ఈయన కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీసర్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం సంతాపం ప్రకటించారు.

మట్టి గణపతులను ప్రతిష్టిద్దాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజలందరూ రాబోవు గణపతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని అందరూ పర్యావరణహిత మట్టి గణపతులను ప్రతిష్టించాలని డి డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ నాయక్ పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ పీడీ కార్యాలయంలో మట్టి గణపతులు ప్రతిష్టిద్దాం – పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమంలో నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, యువజన సంఘం నాయకత్వానికి అభినందన తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈనెల 7న నిర్వహించే గణపతి పండుగ జిల్లా ప్రజలు సంతోషంగా, కుటుంబసమేతంగా గడపాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా పండుగ చేసుకోవాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ యువజన సంఘం ప్రజలను చైతన్యవంతులు చేసే కార్యక్రమాలను నిత్యం చేస్తుందన్నారు. అందులో భాగంగానే మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

అక్రమ నోటీసులు ఆపాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంగన్వాడీలకు ఇస్తున్న అక్రమ నోటీసులను వెంటనే ఆపాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. జమ్మలమడుగు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ అధికారి రాజేశ్వరికి వర్కర్లకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దాసరి విజయ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా అంగన్వాడీ వర్కర్లు ఉద్యోగాలు చేస్తున్నారని, ప్రతిపక్షంలో ఉన్న ఏ పార్టీ అయినా అధికారంలోకి వస్తూనే గ్రామస్థాయి రాజకీయ నాయకులు తమవారికి ఉద్యోగాలు ఇప్పించాలని, ప్రస్తుతం ఉద్యోగాల్లో ఉన్న అంగన్వాడీ వర్కర్ల పట్ల లేనిపోని కారణాలు చూపిస్తూ వారిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. ఐసిడిఎస్ అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి ఎలాగైనా సరే ఉద్యోగాలు తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో అధికారులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అంగన్వాడీ వర్కర్ల పట్ల ఇలాంటి వేధింపులు ఏ ప్రభుత్వంలో లేవని తెలిపారు. ఎప్పుడూ లేని అంగన్వాడీల నియామకాల్లో తప్పులు ఇప్పుడే ఎందుకు కనిపిస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఏసుదాసు, బాషా, అబ్రహం, మునిస్వామి పాల్గొన్నారు.



వయోజన విద్య కిట్లను అందజేస్తున్న చలమయ్య

వయోజనులు అక్షరాస్యులుగా మారాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వయోజనులు అక్షరాస్యులుగా మారాలని పీపుల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కె.చలమయ్య కోరారు. ఎర్రగుంట్ల శాంతినగర్ కాలనీలోని బీసీ హాస్టల్ వీధిలో సొసైటీ ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నైలోని లిటరసీ ఇండియా ట్రస్ట్ వారి ఆర్థికసాయంతో పది నెలల పాటు ఈ వయోజన విద్యా కేంద్రాలు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని 15 గ్రామాల్లో 15 వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించామన్నారు. వయోజనులు నులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యఅతిథిగా పాస్టర్ నిరీక్షణ కుమార్ ప్రారంభించారు. పదిహేను మంది ఉపాధ్యాయులకు వయోజన విద్య పాఠ్య పుస్తకాలు, పలకలు, బ్లాక్ బోర్డులు పంపిణీ చేశారు.



నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎపిఒ జయభారతి

మానవాళి మనుగడకు మొక్కల పెంపకం తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మానవాళి మనుగడకు మొక్కల పెంపకం తప్పనిసరి అని ఉపాధి హామీ పథకం ఎపిఒ జయ భారతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గురజాలలో ఏర్పాటు చేసిన బ్లాక్ ప్లాంటేషన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్లాక్ ప్లాంటేషన్ కింద ఇచ్చిన ప్రతి మొక్కను నాటిన అనంతరం వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తప్పనిసరిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి నాయకుడు లోమడ మురళీకృష్ణారెడ్డి, యాదవ్ పాల్గొన్నారు.

నేత్రదానం.. అంధుల జీవితాల్లో వెలుగు

ప్రొద్దుటూరు: ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగును ప్రసాదించవచ్చని ఆప్తాల్మిక్ అధికారి రఘురామిరెడ్డి తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ యన్‌సిపిబి ఆధ్వర్యంలో, కడప జిల్లా అంధత్వ నివారణ సంఘం మేనేజర్ డాక్టర్ సుశీల నేతృత్వంలో సోమవారం వైద్యశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మరణానంతరం నేత్రాలు దానం చేస్తే ఇరువురి అంధులకు చూపును ప్రసాదించిన వారమవుతామన్నారు. ముందుగా మన ఆరోగ్య సిబ్బంది అందరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. డాక్టర్ శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ అంధత్వాన్ని తగ్గించాలన్నారు. ఆప్తాల్మిక్ అధికారి తేజ, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శోభారాణి, ఎంపిహెచ్‌ఒ స్వరూపుడు మాట్లాడారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పల్లవోలును వేధిస్తున్న డ్రైయినేజీ సమస్య

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై డ్రైయినేజీ కాలువ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలుస్తూ ప్రయాణికులకు, గ్రామస్తులకు ఇబ్బందికరంగా మారుతోంది. ముఖ్యంగా సచివాలయానికి వెళ్లే మార్గం వద్ద చిన్నపాటి వర్షానికి కూడా నీరు వచ్చి చేరుతోంది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి ఏర్పాటు చేసిన సమయంలో గ్రామాల వద్ద డ్రైయినేజీ కాలువలను ఏర్పాటు చేశారు. విశ్వనాథపురం, చాపాడు, పల్లవోలు గ్రామాల్లో కూడా డ్రైయినేజీ కాలువలను ఏర్పాటు చేశారు. అయితే వీటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు గ్రామంలో నిలుస్తోంది. చాపాడులో డ్రైయినేజీ కాలువ పూర్తిగా వ్యర్థ పదార్థాలతో నిండి నిరుపయోగంగా మారింది. పల్లవోలు గ్రామంలో గతంలో పంచాయతీ నిధులతో డ్రైయినేజీ కాలువలో పూడికతీత పనులను చేపట్టారు. కాలువ గ్రామం చివరి వరకు ఏర్పాటు చేయకపోవడంతో కాలువలో ప్రయాణించిన నీరు రోడ్డుపై చేరుతోంది. సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీలకు వెళ్లే మార్గాన వర్షపు నీరు ఉండడంతో ప్రజలు, అధికారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మార్గాన అంకాలమ్మ దేవాలయం ఉండడంతో నిత్యం భక్తులు వెళుతుంటారు. వర్షపు నీరు నిలిచి మురికి గుంత ఏర్పడుతూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పల్లవోలు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు (ఫైల్‌ఫోటో)

ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి



దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం

ప్రజాశక్తి - కడప

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి 15 వ వర్ధంతి సందర్భంగా కడపలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో వైసిపి యువజన విభాగం అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ మాజీ సిఎం అంజాద్‌బాషా హాజరై అన్నదానం చేశారు. కడప నగరం పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం, వస్త్ర దానం చేశారు. అనంతరం జిల్లా కార్యాలయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పార్టీ నాయకులు పులి సునీల్ కుమార్, మహిళ నాయకులు, వైసిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **కలసపాడు :** మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లోని విగ్రహానికి వైసిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుధా రామకృష్ణారెడ్డి, చిత్త రాజశేఖర్ రెడ్డి, సుదర్శన్, కంశెట్టి సుధా, సింగిల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి , రెడ్డిపల్లి నారాయణ, మహానంది పల్లి సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఎంపిటిసి షరీఫ్, పగిడి తామస్, నారాయణరెడ్డి, పాల్గొన్నారు. **గోపవరం :** బద్వేలు మండలం బయనపల్లిలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బద్వేల్ జడ్‌పిటిసి పోలి రెడ్డి, మండల కన్వీనర్ పోకల మల్లేశ్వర రెడ్డి, సీనియర్ నాయకులు పెద్ద పోలిరెడ్డి, సర్పంచ్‌లు నరసింహ, కుప్పలా రమణ, రవి కుమార్ రెడ్డి, అంకిరెడ్డి, దుంపల కృష్ణ రెడ్డి, నాయకులు, రఘు రామిరెడ్డి,సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు. **చాపాడు :** దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలను వైసిపి మండల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మమయ్య, జడ్పీటీసీ భర్త శాంతరాజు, వైసిపి నాయకులు సివి సుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, గంగులయ్య, రాజు, మహేష్, జాఫర్, కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు నడమల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు డాక్టర్ చింతా నవజ్యోత్‌రెడ్డి వైఎస్ఆర్ చిత్ర పటానికి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయంలో ప్రార్థనలు నిర్వహించి, అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనాథలకు మాత్రలు, పారిశుధ్య నిర్వహణకు ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ ఆశ్రమ నిర్వహకులు పాస్టర్ ఇమ్మానియేలుకు అందజేశారు. కార్యక్రమంలో గోపాల కృష్ణయ్య, సూర్య మునిరెడ్డి, హేమంత్, చందు, వెంకట్, ప్రభాకర్, ప్రతాప్, మునెయ్య, వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు సుంకేసుల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. దివంగత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భూమాయపల్లె సమీపంలోని వృద్ధాశ్రమంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి, అగ్రహారం సహకార సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవ రెడ్డి, సెట్టిపల్లె సిద్ధారెడ్డి, సర్పంచ్‌లు భూమన సుబ్బారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, గుత్తి కొట్టాలు వేమారెడ్డి, కొండారెడ్డి, పత్తూరు ఓబులేసు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలు మునిసిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, కౌన్సిలర్ సలోమీ కిరణ్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు, వైసిపి నేత దన్నవాడ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. **సింహాద్రిపురం :** మండల వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహాలకు మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అరవింద నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పూల మాలవేసి నివాళులర్పించారు. బస్టాండు సర్కిల్, గురిజాల క్రాస్, పార్క్, కుమ్మరంపల్లి కాలనీ, బలపనూరు తదితర గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి నాయకులు, ఎంపిటిసి జాఫర్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. **వేముల :** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివారెడ్డి, సత్య ప్రభావతమ్మ దంపతుల ఆధ్వర్యంలో వైఎస్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి చల్లా గంగాదేవి వెంకట నారాయణ, మరక శివకృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి నరసింహారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు పెర్ల రమాదేవి, వేముల సర్పంచ్ సాకే రామంజ నమ్మ, చెన్నారెడ్డి, శ్రీరామిరెడ్డి, పెండ్లూర్ సర్పంచ్ నాగెళ్ల మహేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామ సుబ్బారెడ్డి, బస్ సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, బొజ్జ శివశంకర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మండి మా పీరా పాల్గొన్నారు. **అట్లూరు :** డాక్టర్ వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డికి వైసిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి అందూరి రామకృష్ణారెడ్డి, వైసిపి నాయకులు రొండా మాధవరెడ్డి, పి. బ్రహ్మానందరెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, బిసి నాయకులు రమణయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ అభిమానులచే సేవా కార్యక్రమాలు



వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆలూరు జగదీష్‌బాబు ఆధ్వర్యంలో లీలావతి వృద్ధా శ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లింగాల మండలం జనసేన నాయకులు వేలూరు మహేశ్వర్‌రెడ్డి, కులాయప్ప, మహేష్ ఉన్నారు. **వేంపల్లె :** రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిలకడ, నిబద్ధత కలిగిన నాయకుడిగా పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు పులివెందుల జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన 57కిలోల కేక్‌ను కట్ చేశారు. తిరుమల థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మందికిపైగా పవన్‌కల్యాణ్ అభిమానులు రక్తదానం చేశారు. చక్రాయపేట మండలంలో నాగులగట్టుపల్లెలో చలపాటి నాగమల్లయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు రామగంగిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, జగన్నాథరెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, రెడ్డి కిషోర్, పివి రమణ, వేమా కుమార్, తెలంగాణ వలి, మహమ్మద్, పీరా సాహెబ్, ఫయాజ్ బాషా, డాక్టర్ కరీముల్లా, డక్కా రమేష్, భాస్కర్, వీరబద్ర, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా, వీరలింగేశ్వరరెడ్డి, జనసేన నేతలు శ్యామ్, మల్లి, నంద, దేవా, మనోజ్, నాగేంద్ర పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగులో జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల ద్వారా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలికల వసతి గృహంలో బాత్ రూమ్‌ల మరమ్మతుకు, ఉతికిన బట్టలు ఆరబెట్టేందుకు దిమ్మెలను సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. డిఎస్పీ కార్యాలయం పక్కన రక్తదాన శిబిరం నిర్వహించి, 100 మంది అభిమానులచే రక్తదానం చేయించారు. అక్కడే వెయ్యి మందికి అన్నదానం చేశారు. రక్తదాన శిబిరం ప్రారంభానికి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల దేరంగుల జగదీష్, పవన్, కాటమరాయుడు, పుల్లయ్య, నరసింహ, వినయ్, జనసేన వీర మహిళ వైష్ణవి, థర్మల్ సుబ్బు, ముద్దనూరు కిరణ్, హుస్సేన్ వలి, హరనాథ్‌రెడ్డి, సుధాకర్, షెక్షావలి, భారీ స్థాయిలో అభిమానులు, కార్యకర్తలు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్, ఎంపిడిఒ

ప్రజావేదికకు అధికారుల గైర్హాజర్

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజల, రైతుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల అధికారులు గైర్హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్, ఐసిడిఎస్ కార్యాలయం అధికారులు మినహా మిగతా అధికారులు హాజరు కాలేదు. అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాల్సిన భాధ్యత వారిపై ఉంది. అధికారుల గైర్హాజరుతో వివిధ సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు హాజరు కాకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని కూటమి మండల నాయకులు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు.



డ్రగ్స్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

జీవితాన్ని నాశనం చేసుకోకుండా ఉండేందుకు విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్ సూచించారు. ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో సోమవారం డ్రగ్స్ నిషేదంపై జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాంపస్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్‌ను వాడితే భవిష్యత్ నాశనం అవుతుందని వివరించారు. విద్యార్థి దశలో తప్పు చేస్తే దాని పరిణామం తల్లిదండ్రులపై పడుతుందని తెలిపారు. మాదకద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. నైతిక విలువలను పెంచుకొని మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మధుసూధన రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు ఇందుమతి, సుబ్బరాయుడు, గోవర్ధన్, క్యాంపస్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్ రెడ్డి, డీన్ అకడమిక్స్ డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.

ఆవులు, పందులను రోడ్డుపై వదలొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నగర పంచాయతీలోని ఆవులు, పందుల యజమానులు వాటిని రోడుపైకి వదలొద్దని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన వాటి యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడువు కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ ఆ గడువులోపు వాటిని కట్టడి చేయకపోతే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీవిత బీమా సంస్థ అంటేనే ప్రజలకు ధీమా

-ఘనంగా ఎల్ఐసి 68వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భారతదేశంలోని ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజమైన జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) అంటేనే ప్రజలకు ఎంతో నమ్మకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎల్ఐసికి సాటి మరే ఇతర జీవిత బీమా సంస్థకు లేదని జమ్మలమడుగు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ సేల్స్ ఎన్‌వి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జీవిత బీమా సంస్థ 68వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ ఇన్‌ఛార్జి వెంకటసుబ్బయ్య, బ్రాంచ్ మేనేజర్ సేల్స్ ఎన్.వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రారంభించిన మొట్ట మొదటి ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి అని, నాటి నుంచి నేటి వరకు ప్రజలకు ఎంతో విలువైన సేవలు అందిస్తూ ప్రజల నమ్మకంతో దినదినాభివృద్ధి చెందుతూ దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలిచిందన్నారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ఎల్ఐసి భారతదేశంలోని ప్రజలకు అందిస్తున్న విశిష్టత సేవల గురించి కొనియాడారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ టి.ఆదినారాయణ, ఉద్యోగులు, ఎల్ఐసి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, పాలసీదారులు, ప్రజలు పాల్గొన్నారు.



ఎల్ఐసి వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

క్రైం కార్నర్

ఆటో అదుపుతప్పి బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కాశినాయన

మండల పరిధిలోని కాశినా యన జ్యోతి క్షేత్ర రహదారిలో ఆటో అదు పు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారు బద్వేలు పట్టణానికి చెందినవారు. వీరు జ్యోతి క్షేత్రానికి వెళ్లి, దర్శనానంతరం వస్తుం డగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద విషయాన్ని అంబేద్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్‌రావు 108 వాహనానికి, పోలీసులకు చేరవేశారు.



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి- వేంపల్లె

మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న వేంపల్లెకు చెందిన అయిదు మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ ఆదేశాల మేరకు సిఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడులు చేశామన్నారు. వీరివద్ద నుంచి రూ.12,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్ కిరణ్, మహేష్, రాము నాయక్, ఆనంద్, ఆశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కులమతాలకతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సద్భావన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. పెన్నానగర్‌లో సోమవారం సద్భావన సేవాకేంద్రం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుతమతాలకతీతంగా పని చేస్తూ పట్టణంలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు, మహిళలపై జరిగే దురాగతాలు నిలువరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి, అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా పుల్లారెడ్డి, అధ్యక్షు లుగా అల్లాబక్ష్, ఉపా ధ్యక్షులుగా హరినారాయణ, మొగలి చంద్ర, కార్యదర్శిగా లక్ష్మిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా గౌస్ మెదీన్, పెద్దన్న, కోశాధికారిగా టప్పా మహబూబ్ షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిబంధనల మేరకు 'వినాయక చవితి'

ప్రజాశక్తి - చాపాడు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఏడాది నిబంధనలకు అనుగుణంగా వినాయకచవితి పండుగను నిర్వహించుకోవాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం శాంతి కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి చిన్న సమస్యలు ఉన్నా పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి సమాచారాన్ని తమకు తెలపాలన్నారు. నిమజ్జనం సందర్భంగా చిన్న పిల్లలను నీటి వద్దకు తీసుకు రాకూడదన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా నుంచి నిమజ్జనం వరకు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గురివిరెడ్డి, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

ముద్దనూరు: వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే రోజు బాణాసంచా పేల్చడం నిషేధమని సిఐ దస్తగిరి తెలిపారు. డిజె, మైకులు పెట్టకూడదన్నారు. మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. పండుగ ప్రశాంత వాతా వరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సింహాద్రిపురం : వినాయక ఉత్సవాలను గ్రామాల్లో ఎలాంటి అపశృతి జరగకుండా జాగ్రత్తగా నిర్వహించుకోవాలని ఎస్ఐ నాగతులసి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

బైక్ నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు తప్పక ధరించాలని సిఐ దస్తగిరి తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలో సోమవారం సిఐ ఆధ్వర్యంలో హెల్మెట్, సీటు బెల్ట్ వాడకంపై వాహన దారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. అతివేగం ప్రాణాలకు ప్రమాదమన్నారు. ప్రమాదాల నివారణకు రహదారి నియమాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

పెన్నానదికి నీరు విడుదల

-అప్రమత్తంగా ఉండాలని పలువురి సూచన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీరు విడుదల చేశారు. పెన్నానదికి 400 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో పట్టణ ప్రజలు, నది పరివాహక ప్రాంతాల వారు చూసేందుకు తరలివస్తున్నారు. ఇదే సమయంలో పిల్లలు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.